ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

# సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

**Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.**

**A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 23-26**

## జోగిని వ్యవస్థను చిత్రించిన ఆధునిక ప్రసిద్ధ తెలుగు నవలలు – పరిశీలన

**పేరం అమృతరావు**

తెలుగు అధ్యాపకులు

ఆంధ్ర లొయోల కళాశాల

విజయవాడ – 520008

**ఉపోద్ఘాతం:** భారతదేశం ఎన్నో ఆచారాలకు, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా చెప్పుకుంటాం. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందినప్పటికి సామాజిక అసమానతలలో కూడా అంతే ముందు వరుసలో ఉన్నాం. ఆధ్యాత్మికదేశంగా చెప్పుకుంటునప్పటికి కుల వైషమ్యాలు, ప్రాంతీయ విబేధాలు, మతంచాటున దాగి ఉన్న ఎన్నో రకాల అంధవిశ్వాసాలు భారతీయ పురోగమనానికి అవరోధాలుగా మారాయి. అలాంటి వాటిలో ఒకటి ఈ జోగిని వ్యవస్థ. ముక్కుపచ్చలారని పసిపిల్లల మొదలుకొని యుక్తవయస్సు వచ్చిన బాలికలను ఈ వ్యవస్థ బలితీసుకుంటుంది. అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాలలో అక్కడి ప్రజల పేదరికం, నిరక్షరాశిత, అమాయకత్వం కారణంగా ఆయా ప్రాంతాలలో చాపకింద నీరులా ఈ జోగిని వ్యవస్థ వ్యాప్తి చెందుతుంది.

**కీలకపదాలు:** జోగిని, అంధవిశ్వాసాలు, నవలలు, వ్యవస్థ

ఆచార్య రేఖాపాండే మాటలలో చెప్పాలంటే " Jogins are the modern form of the traditional Devadasi system, which existed in India from the 10th century. Dedicated to the temple to carry out various temple-related duties, these girls were married to an immortal God, and since they could never become widows, they were regarded as auspicious ones. Centuries later, by the time India was colonized, all these girls were practicing prostitution. These girls become the keep of the village headman through whom they have a number of children. Since the whole system is institutionalized under the wraps and cover of religion, the exploitive aspect of the institution is often missed. As most of these women are from marginalized sections of society and are also employed as wage labourers and live below the poverty line, they are merely seen as labourers."

జోగినిగా ఒక ఆడపిల్లను మార్చాలంటే కొన్ని పద్ధతులు పాటించాలి. 'జోగుపట్టం' అంటే జోగినిగా బాల్యంలోనే అర్పించాలి, ఒక్కొక్కప్పుడు నెలలపిల్ల కూడా కావచ్చు లేక గర్భస్థ శిశువైన అయ్యి ఉండొచ్చు. పోతురాజు (ఎల్లమ్మ పాదముద్ర) ఉండే తోలు బిళ్ళతో మంగళ సూత్రధారణ చేస్తాడు. ఆనాటి నుండి ఆమె నిత్యసుమంగళి గా ఇతరులకు లేని హక్కులు, బాధ్యతలు ఆమె కుంటాయి. ఇక మైలపట్టం విషయానికి కొస్తే జోగినిగా మారటానికి పెద్ద తంతు జరుగుతుంది దానికి అయ్యే ఖర్చు మొత్తం ఒక భూస్వామి భరిస్తాడు అతనితోనే మైలపట్టం జరుగుతుంది, అంటే ఆ భూస్వామి ఆ జోగిని కాబోయే అమ్మాయితో సంగమిస్తాడు.

### జోగిని వ్యవస్థను చిత్రించిన ఆధునిక ప్రసిద్ధ తెలుగు నవలలు:

**వేయిపడగలు:**:ఈ నవల 1932వ సంవత్సరంలో ఆంధ్ర విశ్వకళా పరిషత్ వారి పోటీకి పంపబడి, అడవి బాపిరాజు 'నారాయణరావు' నవలతో పాటు బహుమతిని గెలుచుకుంది. ఆ తర్వాత ఆంధ్ర పత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది. విశ్వనాథ సత్యనారాయణ రాసిన పురాణ తెలుగు నవల ఇది. అంతేకాకుండా అనేక భారతీయ భాషల్లోకి అనువదించబడింది. ఈ నవల 1968లో భారత మాజీ ప్రధానమంత్రి పి.వి నరసింహారావు హిందీలోకి 'సహస్త్రఫన్' (ఎ థౌజండ్ హుడ్స్) పేరుతో అనువదించారు. 1995లో దూరదర్శన్ లో టీవీ సీరియల్ గా ప్రసారం చేయబడింది. ఆర్.వి.ఎస్ సుందరం ఈ రచనను కన్నడంలోకి అనువదించారు.

నవల ఇతివృత్త విషయానికి వచ్చినట్లైతే వేణుగోపాలస్వామికి తనను తాను అర్పించుకున్న ఒక దేవదాసి పాత్ర గిరికది. ఈ కథ మూడు శతాబ్దాలుగా సుబ్బన్నపేట అనే గ్రామంలో నివసించే వారి జీవితాలను వివరిస్తుంది. కులవ్యవస్థ, దేవాలయం, కుటుంబవిలువలు మరియు పొలం వంటి సంప్రదాయ సామాజిక నిర్మాణాలలో మార్పుకు, గ్రామ అదృష్టానికి దగ్గరి సంబంధం ఉంది. ఈ అంశాలను హరప్పానాయుడు, రామేశ్వరశాస్త్రి మరియు గణాచారి కుటుంబాలు ప్రతీకాత్మకంగా సూచిస్తాయి. నవల ప్రారంభంలో, వీరన్ననాయుడు ఒక నిధిని కనుగొన్నాడు మరియు ఒక బ్రాహ్మణ జ్యోతిష్కుడు సుబ్బన్నపేటను జమీందారీగా గుర్తించమని ఒప్పించాడు. అతను సుబ్రహ్మణ్యేశ్వర మరియు వేణుగోపాలస్వామికి దేవాలయాలను, శివుడు మరియు విష్ణువుల ప్రాతినిధ్యాలను, ఒక కోటను నిర్మిస్తాడు, ఇది ఊరికి భద్రతను అందిస్తుంది వారి నమ్మకం. రెండు స్థానిక దేవాలయాల పట్ల గ్రామస్తుల నమ్మకాలు క్రమంగా తగ్గిపోతాయి, గ్రామం ఆచార సంప్రదాయాలు క్రమంగా క్షీణించడంతో గ్రామపోషణ దేవుడు సుబ్రహ్మణ్యేశ్వరుని మూర్తీభవించిన వేయిమూరల సర్పం పడగలు ఈ క్షీణతతో అదృశ్యమవుతాయి, కాలక్రమేణా రెండు మాత్రమే మిగిలి ఉన్నాయి. అంతరించిపోతున్న సంస్కృతి సంప్రదాయాలు వేయిపడగలను ప్రతీకగా చెప్పవచ్చు.

**శప్త భూమి:** తెలుగు సాహిత్యంలో అందునా రాయలసీమ ప్రాంతంలో పరిచయం అవసరం లేని వ్యక్తి బండి నారాయణ స్వామి. సాధారణంగా అయన రచనలన్నీ రాయలసీమ మాండలికంలోనే ఉంటాయి. ఆయా ప్రాంతంలో ఉండే బీద బిక్కి ప్రజల కష్ట నష్టాలు, ఆటుపోట్లు, కరువు కాటకాలు, ప్రాంతీయ అస్తిత్వ, సంస్కృతీ, సంప్రదాయాలు తన రచనల్లో తారసపడతాయి. శప్తభూమి నవల విషయానికి వచ్చినట్లైతే ఇది ఒక చారిత్రక నవల. ఈ నవలకు ముందుమాట రాస్తూ కుం. వీరభద్రప్ప శప్తభూమి అంటే శపించబడిన భూమి (The Cursed Land ) అని నిర్వచించారు. 2017 తానా ఉత్తమ నవలల పోటీలో మొదటి బహుమతి, 2019 కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతిని పొందింది.

నవల ఇతివృత్తాన్ని గురించి చెప్పాలంటే 18వ శతాబ్దంలో రాయలసీమ ప్రాంతానికి చెందిన చరిత్రను రచయిత ఈ నవలలో నమోదు చేశాడు. శ్రీకృష్ణదేవరాయల పాలన తరువాత పాలెగాళ్ళ సంస్థానాలలోని రాజకీయాలు, కక్షలు, కార్పణ్యాల మధ్య నలిగిన ప్రజల జీవితాలు, పాలెగాళ్ల దౌర్జన్యాలు, బసివిని వ్యవస్థ, సతీసహగమనం వంటి అనాచారాలు, కరువు కాటకాలకు తట్టుకోలేక పసిపిల్లలను అమ్ముకునే దుస్థితి ఈ నవలలో వర్ణించబడ్డాయి. రచయిత తనకు తెలిసిన గాలిదేవర సమాధి/గులిగానప్ప పరస/కదిరప్ప స్వామి పరస/వీరగల్లులు మొదలైన చారిత్రక దాఖలాలను ఆధారం చేసుకుని ఈ నవలను రాసాడు. అదే సమయంలో వర్తమాన సందర్భమైన తెలంగాణా ఉద్యమం కూడా రచయితను ప్రభావితం చేసింది. రాయలసీమ ప్రాంత ఆర్థిక, సామాజిక, రాజకీయ, మత, సాంస్కృతిక పరమైన చరిత్రను నవలారూపంలో అందించాలని భావించాడు.

**మనోధర్మ పరాగం:** మధురాంతకం నరేంద్ర తెలుగు, ఆంగ్ల భాషలలో రచయిత. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల విభాగంలో ఆచార్యుడుగా పనిచేస్తున్నారు. ఆయన ప్రముఖ కథకుడైన

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 23-26

మధురాంతకం రాజారాం కుమారుడు. ఆయన రాసిన మనోధర్మ పరాగం అనే ఈ నవలకుగాను 2019లో ఆటా బహుమతి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించాయి.

నవల విషయానికి వచ్చినట్లైతే మొత్తం ముప్పై పాత్రలు ముప్పై అంకాలుగా చేసి ఈ నవల రాయబడింది. ఒక్కో పాత్ర వచ్చి తన మనోగతాన్ని చెప్పుకుంటూ పోతుంది. అయితే అది రచయితకు చెప్తుందా, కాలానికి చెప్తుందా అనే విషయం అంత వివరంగా ఉండదు. చిత్తూరు స్కంద కుముదవల్లి నుండి నాగలక్ష్మి నటరాజన్ వరకూ కథను వంద సంవత్సరాలకి పైగా నడిపే ముప్పై పాత్రలు ఈ నవలలో ఉన్నాయి. ఇది చరిత్రలో విస్మరించబడిన దేవదాసీ వ్యవస్థ అనే ఒక సామాజిక చీకటి కోణాన్ని సజీవంగా మనముందుంచడానికి వాళ్ళదైన కాలంలోకి, వాళ్ళదైన సమాజంలోకి మనల్ని తీసుకెళతాయి. ఇవి వాళ్ళ మాండలీకంలో వాళ్ళ నేపథ్యంలో వాళ్ళ భాషలోనే మాట్లాడతాయి. గమనించాల్సిందేమిటంటే, ఈ పాత్రలన్నీ స్త్రీలవే. పజ్జెనిమదిమంది దేవదాసీలు, పదకొండుమంది బ్రాహ్మణ స్త్రీలు, ఒక శూద్ర మహిళ పాత్రలతో ఈ నవల ఎంతో వైవిధ్య బరితంగా ఉంటుంది.

**ముద్ర:** తెలుగు సాహిత్యంలో రాసాని రాసిన 'ముద్ర' నవలకి ప్రత్యేక స్థానం ఉంది. ఈ నవల రాయలసీమలోని వెనుకబాటు తనానికి, మూఢవిశ్వాసాలకు ప్రజల అమాయకత్వానికి నిదర్శనంగా నిలుస్తుంది. భిన్నమైన వస్తువు, విభిన్నమైన రచన శైలీ పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. తమిళ, మలయాళ, కన్నడ భాషలలోకి ఈ నవల అనువదించబడింది. బసివిని ఆచారానికి బలైన కోటమ్మ జీవిత ఇందులోని ప్రధాన ఇతివృత్తం. రాయలసీమలోని కరువులు, అందులో ఛిద్రమైన దళిత, బహుజనుల స్థితి గతులను చర్చిస్తుంది. భూస్వాముల అహంకారానికి బసవినిగా మార్చబడ్డ కోటమ్మ బసవి అయిన కొన్నాళ్ళకు ఒక ఆడబిడ్డకు జన్మనిస్తుంది. కొన్నాళ్ళకు ఆ ఊరినుండి ఒక తమిళ వ్యక్తితో వెళ్లిపోయి, అతనికి రెండో భార్యగా ఉంటుంది. మొదటి భార్యకు కోటమ్మకు జరిగిన గొడవలో ఆ తమిళ వ్యక్తి కోటమ్మను కొట్టి దుర్భాషలాడుతాడు.

అక్కడ నుండి వేరొక ముస్లిం వ్యక్తి పరిచయమై క్రమంలో తెలిసిన వాళ్ళ దగ్గర పని ఇప్పిస్తానని చెప్పిన అతను హసీగా పేరు మార్చి ముంబయిలోని వేశ్య వాటికకు అమ్మేస్తాడు. ఎన్నో కష్టాలు పడి అక్కడ నుండి తప్పించుకొని సొంత గ్రామానికి వచ్చేస్తుంది. అయితే తన గ్రామంలో కూడా పరిస్థితులు మారవు కోటమ్మకు పుట్టిన కూతురిని బసివినిగా చేయాలనీ చూస్తారు గ్రామపెద్దలు. వాళ్ళ బారి నుండి తన కూతుని కాపాడుకునే ఇతివృత్తమే ఈ నవల.

**జోగిని:** వల్లూరిపల్లి శాంతి ప్రబోధ రాసిన జోగిని నవల సామాజిక ఇతివృత్తంతో కూడుకున్నది. తెలంగాణ పల్లెల్లో కొనసాగుతున్న జోగిని ఆచారానికి బలైపోతున్న ఆడబిడ్డల వ్యతలను తన నవల ద్వారా వ్యక్తీకరించారు శాంతి ప్రబోధ. కవిత, విద్య స్నేహితురాళ్ళు వేసవి సెలవుల్లో విద్యా కవిత వాళ్ళ ఊరు వెళ్తుంది. అదే సమయంలో ఆ ఊరి గ్రామ దేవత జాతర జరుగుతుంది. జాతరలో భాగంగా వింత ఆచారాలు విద్యను ఆశ్చర్యానికి గురిచేస్తాయి. వాటి గురించి తెలుసుకోవడానికి తనకు ఆసక్తి కలుగుతుంది. గ్రామంలో జరిగే ఊర పండుగలు, పోతురాజులు, శిఖము వచ్చి ఊగే జోగినీలు, జంతు బలులు, మూఢవిశ్వాసాలతో పెనువేసుకుపోయినా తెలంగాణ పల్లెల్లోని అడుగు ప్రజల దీనవ్యతల సారాంశం ఈ నవల నేపథ్యం.

ఆ గ్రామంలో తనకు ఎదురైన అనుభవాలపై ఆసక్తి పెంచుకున్న విద్య. ఆ సమస్యను పరిశోధనాంశంగా తీసుకొని పీహెచ్డీ చేయాలనుకుంటుంది. అందుకోసం ఆ గ్రామంలో ఉన్న జోగినీలను కలుసుకొని వారి జీవిత విశేషాలను తెలుసుకుంటుంది. లోతుగా అధ్యయనం చేసిన విద్యకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఒకే కుటుంబంలో ఉన్న నలుగురు జోగినిల దీనస్థితులు ఆమెను ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఆ వ్యవస్థ పై తిరుగుబాటు చేసిన సాయవ్వ అనే జోగిని, గ్రామానికి సర్పంచి అయి గ్రామాన్ని

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

# సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 23-26

అభివృద్ధి పథంలో నడుపుతుంది. రాష్ట్రపతి అవార్డును కూడా అందుకుంటుంది. చెల్లి అనే ఒక సంస్థ ఇచ్చిన ప్రోత్సాహంతో సాయమ్మ జీవితం మారుతుంది. ఆమె ప్రస్థానమే ఈ నవలలోని ప్రధానాంశం.

**మట్టి బతుకులు:** రాసానిచే రచించబడిన మరో వైవిధ్య భరితమైన నవల మట్టి బతుకులు. 1995లో డిసెంబర్ నెలలో చతుర మాసపత్రికలో ప్రచురించబడింది. ఊర్లో అక్రమాలు, అన్యాయాలు, చివరకు హత్యలు చాలా మామూలు. అమాయకులను అడ్డుపెట్టుకొని, తన చేతికి మట్టి అంటకుండా ఆడింది ఆటగా పాడింది పాటగా నిత్య పెళ్లికొడుకులా విలాస జీతం గడిపేస్తున్నాడు ఊరి పెద్ద. ఆచారాల పేరుతో అందమైన అమ్మాయిలను జరపట్టే ఆటవిక శృంగార క్రీడలకు ఆ ఊరు వేదికయ్యింది.

ఆధునిక యుగంలో కూడా ఇంతటి అంధకారంలో మగ్గిపోతున్న ఓ మారుమూల పల్లెకథకు అక్షర రూపము అందించారు రాసాని. రాయలసీమ ప్రజల వృత్తి జీవితాన్ని, భూస్వాములు, పెత్తందారులు అట్టడుగు వర్గాల శ్రమ ఏ విధంగా దోచుకుంటున్నారో, వారిని ఎదిరిస్తే వాళ్ల జీవితాలు ఎలా అంత మొందుతాయో ఈ నవలలో వివరించబడింది.

**ముగింపు:** సాహిత్యంలో నవలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. చెప్పదలచుకున్న విషయాన్ని విపులంగా, ఎక్కువ నిడిదితో సూటిగా చెప్పడానికి నవల ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాకుండా ఇతర సాహిత్య ప్రక్రియాలైన కవిత్వం, కథలను తనలో ఇముడ్చుకోగల ప్రక్రియ నవల. పైన చర్చించిన నవలలలో కొన్ని నవలలు జోగిని సమస్యను నవలలో భాగంగా చిత్రిస్తే, మరి కొన్ని నవలలు జోగిని వ్యవస్థను రూపుమాపడానికై రచియించిన నవలలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికి జోగిని వ్యవస్థ నిర్మూలనలో తెలుగు సాహిత్యరంగంలో ఇదొక గొప్ప ప్రయత్నంగానే చెప్పాలి.

**ఉపయుక్త గ్రంథాలు**

నరేంద్ర, మధురాంతకం. మనోధర్మ పరాగం. హైదరాబాద్: అన్వీక్షికి ప్రచురణలు, 2020.
నారాయణస్వామి, బండి. శప్తభూమి. హైదరాబాద్: అన్వీక్షికి ప్రచురణలు, 2020 .
రాసాని, వి.ఆర్. ముద్ర. హైదరాబాద్: విశాలాంధ్ర బుక్ హౌస్, 2013.
లలిత, వకులాభరణం. జోగిని వ్యవస్థ. హైదరాబాద్: విశాలాంధ్ర బుక్ హౌస్, 2012.
సత్యనారాయణ, విశ్వనాథ. వేయిపడగలు. విజయవాడ: విశ్వనాథ పబ్లికేషన్స్, 2004.
Rekha Pande, Married to God – the jogini system in india, Pakistan Journal of Women's Studies: Alam-e-Niswan Vol. 25, No.2, 2018.